# కథ

కేశవమూర్తి కారు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఆగింది. కేశవమూర్తి కారు ముందూ, వెనకా కూడా చాలా వాహనాలు ఆగాయి. నడిచే మనుషులు మాత్రం చీమల బారుల్లా నడిచి పోతూనే ఉన్నారు ఫుట్‌పాత్‌ల మీద. అలా నడిచి వెళ్ళే వాళ్ళ వైపు అనాసక్తిగా చూస్తున్న కేశవ మూర్తికి ఫుట్‌పాత్ మీద నడుస్తూ పక్క సందులోకి మలుపు తిరుగుతున్న మనిషిని చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. అతడు... అతడు... గౌరీ శంకర ప్రసాద్ కాదూ ?"...

కాకపోవచ్చు.... మనుష్యుల్ని పోలిన మనుషులుండడం తరచూ చూస్తూనే ఉంటాం... అయినా గౌరీ శంకరం అలా దీనంగా ఉండాల్సిన అవసరం ఏమిటి ?... కానీ గౌరీ శంకరాన్ని నేను గుర్తుపట్టలేకపోవడమేమిటి ? ఎన్ని వేల మంది జనంలో ఉన్నా అతని తీరు, నడకా, పద్ధతి నే నేలా మరువగలను ? అలా మరిచిపోయేటంత కృతఘ్నత నాలో ఎలా కలుగుతుంది ? మరి అతను గౌరీ శంకరమే అయితే అసలు అలా ఉంటాడా ?... లేక... అతని కజిన్స్ ఎవరైనా అయి ఉండవచ్చునా ? అలా అయ్యే పక్షంలో అతడి పోలికలు కొన్ని ఇతడికి వచ్చి ఉండడంలో ఆశ్చర్యంలేదు.... కానీ ... ఇతను మాత్రం గౌరీ శంకరమే అయి ఉండవచ్చునని అతని మనసు చెపుతోంది.

ట్రాఫిక్ లైన్ క్లియరైంది. గ్రీన్ సిగ్నల్ వచ్చింది. డ్రైవరు కారు స్టార్ట్ చేశాడు. తిన్నగా వెళ్ళబోయే కారుని ఎడమ చేతి వైపు తిప్పమని డ్రైవర్‌కి చెప్పాడు కేశవమూర్తి. కారుని ఎడమ వైపు తిప్పగానే "చూడు లతీఫ్ ! కారుని నిదానంగా నడుపుతూ ఉండు. నేనెరిగున్న ఒకతను ఇటు వెళుతున్నాడు. అతన్ని పలకరించాలి" చెప్పాడు కేశవమూర్తి.

కారు నెమ్మదిగా కదులుతోంది. ఫుట్‌పాత్‌ల వైపు పరీక్షగా చూస్తున్నాడు కేశవమూర్తి. చటుక్కున "ఆగు లతీఫ్ ! కారాపు" అన్నాడు. లతీఫ్ కారు ఆపాడు. కారుని దాటి వెళ్ళబోతున్న అతన్ని చూపించి లతీఫ్ ! అతన్ని పిలిచి కారు ఎక్కించుకో !" అన్నాడు కేశవమూర్తి.

ప్రశ్నార్థకంగా చూశాడు లతీఫ్.

"క్విక్ ఆలస్యం చెయ్యకు —లే.... ! దిగు... వెళ్ళు !" తొందర చేసాడు కేశవమూర్తి. ఈలోగా మరి నాలుగడుగులు వేసి కారు దాటి వెళ్ళాడతను. ఆది గమనించిన లతీఫ్ "వన్ మినిట్ సార్!" అంటూ కారునిపది, పదిహేనడుగులు ముందుకు తీసుకు వెళ్ళి ఆపి దిగాడు. నాలుగడుగులు వెనక్కి వేసి అతనిని కలిశాడు. అతడిని ఆపి విషయం చెప్పి కారు దగ్గరికి తీసుకువచ్చాడు. కారు ముందు సీటులో తన పక్కన చోటు చూపించాడు. హఠాత్తుగా జరిగిన ఈ పరిస్థితికి ఆశ్చర్యంగా చూశాడతడు.

ఇంతలో కేశవమూర్తి వెనుక తలుపు తెరిచాడు. అతను సందేహిస్తూ కారు దగ్గర అలాగే నిలుచున్నాడు.

అతని వాలకం చూసిన లతీఫ్ "ఎక్కవయ్యా బాబూ ! మొద్దులా నించుంటావేమిటి అలా ! ఎక్కెక్కు !" తొందరపెడుతూ కసుక్కున్నట్టుగా అన్నాడు. "ల... తీ... ఫ్....!" కేశవమూర్తి తీవ్ర స్వరానికి లతీఫ్ కంగారు పడ్డాడు. "ఎస్సర్!" అన్నాడు తలబడుతూ. వెనుక తలుపు పూర్తిగా తెరిచి పట్టుకుని "ప్లీజ్ గెటిన్ !" అన్నాడు సాదరమైన గొంతుతో ! అప్పుడు చూశాడతను కేశవమూర్తి వైపు.

క్షణ కాలం అతడి కళ్ళలో మెరుపు. వెనువెంటనే —సందేహం... సంకోచం... ! ... తడబడుతూ... "నో... నో... సారీ" అంటూ తల పక్కకి త్రిప్పుకుని ఒక అడుగు వేశాడు. కేశవమూర్తి కంగారుగా కారు దిగుతూ "ప్లీజ్... ప్లీజ్...!" అన్నాడు బ్రతిమాలుతున్నట్లు.... అంతకన్నా అతనిని ఎలా కన్విన్స్ చెయ్యాలో తెలియలేదు కేశవమూర్తికి.

అతడు ఇబ్బందిగా తలదించుకున్నాడు. తన వాలకం చూసుకుంటూ తన మీద తనకే జాలిపడుతున్నట్లు రెండుసార్లు తల విదిలించాడు. సన్నగా నిశ్వసించి చివరికి ఓ నిర్ణయానికి వచ్చినట్లు "ఊ...( సరే !" అన్నాడు.

కేశవమూర్తి పొంగిపోతూ తను సీటులో కూర్చుని జరిగి అతనికి చోటిచ్చాడు. తర్వాత కారు తలుపు మూసి... "ఇంటికి పోనీయ్!" అన్నాడు. అతడి ఆజ్ఞ కాగానే కారుని పోనిచ్చాడు లతీఫ్! అతడు స్థబ్దుగా కూర్చున్నాడు. కనీసం మొహం తిప్పి బయటికి కూడా చూడడం లేదు.

"మీరు... మీరు... గౌరీ శంకరం... అదే... గౌరీ శంకర ప్రసాద్ కదూ ! ప్రశ్నార్థకంగా చూస్తూ" అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు కేశవమూర్తి.

కేశవమూర్తి చేతిలోని అతని చెయ్యి సన్నగా ఒణికింది. రెండు క్షణాలు నిశ్శబ్దంగా ఉండి ఒక నిట్టూర్పుతో "అవును" అన్నట్లు తల ఊపాడు గౌరీ శంకరం. కేశవమూర్తి ఇంకేమీ ప్రశ్నించలేదు. గౌరీ శంకరం చేతిని అలాగే అపురూపంగా పట్టుక్కూర్చున్నాడు.

కారు హారన్ విని వాచ్‌మేన్ వచ్చి గేటు పూర్తిగా తెరిచాడు. కారు గేటులోంచి దూసుకుపోయి పోర్టికోలో ఆగింది. తను గబగబా ముందు దిగి రెండో వైపు తిరిగి వచ్చి డోర్ తీసి పట్టుకున్నాడు కేశవమూర్తి. తీయబోతున్న తననాపి యజమానే డోర్ తెరవడం చూసిన లతీఫ్‌కి చాలా ఆశ్చర్యం వేసింది. అంత పెద్ద ఆఫీసరయిన తన యజమాని మరీ ఇంత నమ్రతగా ఉండడం వింతేమరి ! "సార్‌కి పెద్దల యందు వినయం ఎక్కువే ! కానీ మరీ... ఇంతా ? యజమాని బ్రీఫ్‌కేస్ తెచ్చి హాల్లోని టేబుల్ మీద పెట్టాడు.

కేశవమూర్తి గౌరీ శంకరాన్ని సోఫాలో కూర్చోబెట్టి ప్రక్కనే తనూ కూర్చున్నాడు. అయిదారు నిమిషాల్లో పొగలు కక్కుతున్న చిక్కని కాఫీని, రెండు కప్పుల్ని ట్రేలో పెట్టుకుని వచ్చింది వసుంధర.

భర్త పంపిన సందేశం ప్రకారం ఆమె ఇలా ప్రత్యక్షం కావడం తరుచూ జరుగుతూనే ఉంటుంది. కానీ ఈసారి ఈ ఆగంతకుడెవరో ఆమెకు తెలియలేదు. ఎక్కడో చూసినట్లనిపిస్తోంది గానీ స్పష్టంగా గుర్తురావడం లేదు. కొంతసేపు అలా యోచించి చివరకు భర్త వైపు ప్రశ్నార్థకంగా చూసిందామె.


వీరు... గౌరీశంకరప్రసాద్‌గారు. నేను నీకు ఎప్పుడూ చెప్తూండేది వీరిగురించే... జ్ఞాపకం వచ్చిందా వసూ!" భర్త సంబరంగా గుర్తుచేస్తూంటే ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ చూస్తుండిపోయిందామె.

"గౌరీ శంకరప్రసాద్ వంశజులందరూ ఎంత సత్పీలురో భర్త ద్వారా కథలు, కథలుగా వినిఉండటంవల్ల అతడిని చూస్తూనే అతడి స్థితి అంచనా కట్టే ప్రయత్నం చేస్తున్నది వసుంధర.

ఓడలు బళ్ళు కావటం, బళ్ళు ఓడలు కావటం వింది, చదివింది. కాని ప్రత్యక్షంగా చూస్తున్నది మాత్రం ఇప్పుడే! పరిచయాలూ, కాఫీసేవనం అయ్యాక "స్నానానికి ఏర్పాట్లు చేయించు వసుంధరా!" అని భార్యకి పురమాయించి, గౌరీశంకరాన్నితన గదిలోకి తీసుకు వెళ్ళాడు కేశవమూర్తి. షేవింగ్ వగైరాలయిన తర్వాత మిత్రుని స్నానానికి పిలుచుకెళ్ళాడు కేశవమూర్తి.

★ ★ ★

ముందుచూపులేకుండా వంశగౌరవం, ప్రతిష్ఠ నిలవటం మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని చితికిపోయిన జమీందారీ కుటుంబాలలాగే మా కుటుంబమూ దివాళా తీసింది మూర్తి! నీకు తెలిసిన విషయాలకి తోడు నీకు తెలియని విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. బామ్మగారు, తాతగారూ నన్ను రాకుమారుడులాగేనే చూసేవారు. సుఖమే తప్పకష్టం అనేది లోకంలో ఉంటుందని కూడా నాకు తెలియనీకుండా పెద్ద చేశారు. మా మేనత్తల పిల్లల్ని కూడా నన్ను చూసినంత బాగా చూసేవారు కాదు. అది నాకు చాలా గర్వం కూడా ఉండేదానాడు. మా ముందు తరాలలాగే మా తరం సంపన్నంగానే గడిచిపోవాలనే పట్టుదలతో దర్జాగా రోజులు గడిపేవారేగాని, లోలోపల పరిస్థితులకి క్రుంగిపోతూండేవారనిపిస్తుంది. ఇలా ఇప్పుడాలోచిస్తు



# జమీందారు

ఆచంట హైమవతి

న్నాను గాని ఆ రోజుల్లో.... అందర్లో మిన్నగా కనిపించాలనే తపనా, డాంబిక దృష్టి బాగానే ఉండేవి.

'పర్వదినాలొస్తే యాగాలు, కళ్యాణాలు, దానాలు కొనసాగేవి. పండుగలొస్తే బంధు బలగం కుటుంబాలకి కుటుంబాలు వారాలు, నెలలు మా ఇంట్లోనే ఉండిపోయేవారు. వారు వెడతామన్నా బలవంతపెట్టి మరిన్ని రోజులు వారిని సత్కరించటం. వెళ్ళేటప్పుడు పేరు, పేరునా వెలగల బట్టలతో సాగనంపటం లాంటివి సామాన్య విషయాలు".

"ఆడపిల్లలకి భారీ కట్నాలతో వెళ్ళిళ్ళు. మూడు, అయిదు, ఏడు, పది రోజుల పెళ్ళిళ్ళు. వారి పసుపు– కుంకుమలకనే పేరుతో ఎకరాలకి ఎకరాల భూములు. మళ్ళీ అభిమాన లాంఛనాలుగా గృహాలు. అల్లుళ్ళకి అలకపాన్పుల పేరు మీద ఘనమైన బహామానాలు... ఇలా కొంత ఆస్తి కరిగిపోయింది".

"రూల్స్ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని బంధు మిత్రుల పేర్లపై కొన్ని ఎకరాలు రిజిష్టర్ చేయిస్తే... వాళ్ళు అది కాస్తా స్వాహాచేసి ఖాళీ చెయ్యి చూపించారు. మింగలేక– కక్కలేక ఉక్కిరి బిక్కిరైన పరిస్థితులెన్నో! మా నౌకరు కుటుంబం తరతరాలుగా మా ఇంటినే అంటి పెట్టుకుని సేవచేసినందుకు వారికీ మా తాతగారు కొంత భూమి రాసి ఇచ్చారు. సినిమాలలో చూపించినట్టు కష్ట సమయం గ్రహించి తనకిచ్చిన భూమిని తిరిగి తీసుకోమని బలవంతం చేశాడు. ఆ విషయంలో వాడి కుటుంబ సభ్యులందరితో ఘర్షణపడి చెడ్డవాడయ్యాడు. "నువ్వు ఇచ్చే ముష్టి తీసుకుంటానా నేను?" అనే సాకుతో వాడిని తిట్టి మానిపించానీ. దానం చేసిన దాన్ని తిరిగి ఆశించటం... దాన్ని స్వీకరించటమంత అధర్మం ఇంకొకటి లేదు. నా దృష్టిలో! ఆర్థికంగా దరిద్రం అనుభవిస్తున్నా... మానసిక దరిద్రం అనుభవించటం... హారిబుల్!".

"ఆస్తిపరంగానూ, అర్థపరంగానూ జరుగుతున్న లావాదేవీలేమీ మాకెవరికీ తెలియనిచ్చేవారు కాదు నాన్నగారు. మా దగ్గర తీసుకున్న వాళ్ళని అడగలేకపోయేవారు నాన్నగారు. అడగటం అంటేనే అవమానం ఫీలయ్యేవారనిపిస్తుంది. వాళ్ళు కనిపించినప్పుడు ముందుకాళ్ళకి బంధం వేసినట్లు తెగపొగిడేవారు. అధిక మర్యాదలు చేసేవారు. కాని ఇవ్వాల్సింది ఇస్తామనే వారూ కాదు. ఇచ్చేవారూ కాదు."

"మాకిచ్చిన వాళ్ళు మాత్రం కోర్టుకెక్కుతామని బెదిరించటంతో ఉన్న ఆస్తిలో కొంత అమ్మాల్సి వచ్చేది. మంచిధర పలికే వరకూ వేచి ఉండటానికి తగ్గ సమయం లేకపోవటంతో ధర తక్కువ వచ్చేది. అమ్ముకోవటం అవమానకరం కదా అందుకు రహస్యంగా అమ్మటం వల్ల రకరకాల వాళ్ళకి చేతులు తడపాల్సి వచ్చి కొంత హరించుకుపోయింది".

"ఏనాటి నుంచో అలవాటైన భోగాలను మానుకోలేకపోవటం కూడా ఒక వ్యసనమే! ప్రభుత్వం జమీందార్లకిచ్చే "గౌరవ భరణం"

శాంత: పిన్నిగారూ? మంచి కెరియర్ కోసం ఆప్ టెక్‌లో చేరదామనుకుంటున్నానండీ
పిన్నిగారు: ఆప్‌టెక్ లో ఎందుకూ? మన వీరాసామి కొట్లో స్టీలు సేలమ్ స్టీలు. ఒకేసారి డబ్బు కడితే ఐదుశాతం డిస్కౌంటు కూడాను. నీకు మంచి క్యారియర్ అమరుతుంది

సి. ఉమ, సూరత్



చాలేది కాదు. మళ్ళీ అప్పు... మళ్ళీ భూమి అమ్మటం అప్పు తీర్చటం... ఇలాగే! తల్లిదండ్రులకు తెలియకుండా చేశానని అనుకునేవారు నాన్నగారు. కాని చూచాయగా ఉభయులకీ తెలిసే ఉంటుంది. అందుకే పూర్వపు రోజుల్ని స్తుతిస్తూ ఈ రోజుల్ని ఏదో ఒక కారణాన తెగడుతూ... దూషిస్తూండేవారు".

"మా ఆఖరు మేనత్త పెళ్ళికి కూడా ఏనుగు మీద అంబారీ కట్టించి అందులోనే ఊరేగించాలని మొండిపట్టు మా బామ్మగారికి. వెండి కుర్చీ పీటలు కావాలని మా మేనత్త ఆడపడుచులు అయిదుగురు అలగటం... చివరికి వారిని బతిమిలాడి వెండిపూతగల ఇత్తడి కూర్చీపీటలు నగిషీలవి వేయించి పంపించారు మా అత్తయ్య కాపురానికి వెళ్ళేటప్పుడు. ఇలాగే... అనేకం. ఎన్నని చెప్పను?"

"వీటన్నిటికీ తోడు ఉద్యోగం చెయ్యటం అవమానకరమనీ, అప్రతిష్ఠ అనే అభిప్రాయం మా అందరి మనస్సులోనూ సుస్థిరంగా ముద్రవేసేశారు. ఉగ్గుపాలతో వాటిని కూడా రంగరించి పోశారు".

"మా బామ్మగారు, తాతగారూ పోయేసరికి నేను డబుల్ గ్రాడ్యుయేటయ్యా గదా నీతోపాటే నేనూ ఏదో ఒక ఉద్యోగం వెతుక్కుంటే బాగుండేది. ఉద్యోగం పురుష లక్షణం అనే సూక్తి మా అంతటి వాళ్ళకి కాదనే మా పెద్దల నిశ్చితాభిప్రాయం". అలాంటి సలహా చెప్పటానికే ఆత్మీయులు జంకేవారు. ఒకరిద్దరు ధైర్యం చేసి చెప్పినా వాళ్ళమీద నాన్నగారు విరుచుకుపడేవారు. అవహేళన చేస్తున్నారని ఉక్రోష పడేవారు. దేశకాలమాన పరిస్థితులతోపాటు మనమూ మారాలనీ, అలా మారగలిగితేనే మనుగడ సాగుతుందనీ ఈ అతిచిన్న సిద్ధాంతాన్ని నమ్మటానికి, ఒప్పుకోవటానికీ ఎవరికీ ఇష్టం ఉండేదికాదు. నాకు కూడా ఆనాడదే భావం. ప్రపంచ స్థితిగతులు ఆకళింపు అయినా దానికి అలవాటుపడేటందుకు చేస్తున్న ప్రయత్నం ఫలించకుండానే వారిని మృత్యువు కబళించింది".

"ఇద్దరూ అయిదారునెలల తేడాతో స్వర్గస్తులయ్యారు. వారి మరణానికి సగం కారణం చితికిపోయిన మా స్థితిగతుల వల్ల కలిగిన మానసిక వ్యథేనని నా నమ్మకం. నాకు తెలిసినా ఏమీ చెయ్యగలిగే స్థితిలోలేనానాటికి".

గౌరీ శంకరం తల్లిదండ్రులు పోయారని తెలియగానే కన్నీరు వచ్చింది కేశవమూర్తికి. తనని ఎంతగా అభిమానించేవారా దంపతులు? గౌరీ శంకరానికి స్నేహితుడు మాత్రమే తను. కానితనకి ఎన్నోసార్లు పరీక్షల ముందు జీతం కట్టి తన చదువు కుంటుపడకుండా రక్షించేవాడు గౌరీశంకరం. ఆనాటి అతని దానగుణ భిక్షే తనకీనాటి ఈ ఉచ్ఛస్థితికి మూలం! ఎంత శ్రద్ధగా చదివే విద్యార్థికయినా కొంతైనా ఖర్చు లేకుండా చదువు పూర్తికాదుగదా! ఆనాడు వారి సహాయం లేకుంటే తను ఏమయ్యేవాడు? ఊహించ శక్యమా? ఓహ్! అందుకే కవులు బాంధవ్యం కంటే మైత్రీభావమే శాశ్వత మయినదని నొక్కి వక్కాణించారు అనుకున్నాడు కేశవ మూర్తి.

పేరుకి చివర'గారు' అనే పదం తగిలించకపోయినా 'మీరు —రండి —చూడండి' అంటూ బహువచన ప్రయోగమే చేసేవాడు గౌరీశంకరాన్ని తను. తన ఈ అణుకువే ఆ జమిందారీ కుటుంబాన్ని తృప్తిపరచిందని తనకీ తెలుసు. ఆ మరుసటి సంవత్సరం తను ఐఎఎస్‌కి సెలెక్టై ట్రైనింగ్‌కి వెళ్లాడు. గౌరీ శంకరం తర్వాత... తర్వాత అంటూ అశ్రద్ధ చేశాడు. తర్వాత వెళ్లాడో! లేదో! కేశవమూర్తి ఆలోచనకి అంతరాయం కలిగిస్తూ గౌరీ శంకరం సన్నగా దగ్గి మళ్లీ మొదలు పెట్టాడు.

మా తాతగారి దగ్గర మా నాన్నగారి దగ్గర సహాయం పొందిన ఒకరిద్దరు నాకు మంచి జాబు ఇస్తామనీ, చెయ్యమనీ చాలా బలవంతం చేశారు. ఆనాడు నాలో జమిందారీ మనస్తత్వం తెచ్చిన భేషజం... ఇంకా మెండుగానే ఉండేది. వాళ్లు నెలకి, రెండు నెలలకి వచ్చి నన్ను బలవంతపెట్టి బతిమాలేవాళ్లు. ఒక సారి వద్దు అన్నాక మళ్లీ కావాలంటే ఒక మాటమీద నిలబడలేనివాడను కుంటురేమోనని జంకు కూడా మనస్సులో ఒక మూల ఉండేది నాకు. అవన్నీ కొంచెం...కొంచెం....తగ్గి... వెనుతిరిగి చూసుకుంటే.... ఏముంది?!...మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి అన్న సామెతగా తయారయింది పరిస్థితి. బయట ప్రపంచం ఎంత తెలివి మీరిందో! ఆశ్చర్యం!....

మీకు ఉద్యోగం ఇచ్చేటంతటి వాళ్లమా సార్...మేము? అనే వాడొకడు. అతి వినయంగా అన్నా వాడి మాటలో ఎంతపదును?... హేళన...?

మీరు కూడా మా వ్యాపారంలో భాగస్తులయితే ఆలోచించగలం సార్. మీకు ఇదొక లేఖ్ఖా సార్! అంటూ తప్పించుకో చూసే వాళ్లొకరు. నేనిలాంటివి కొన్నిచూసి మోసపోయాను మూర్తి!

నా వెనుక మాట్లాడే ఆఁ వీడేం పనిచేస్తాడ్రా! ఈ జమీందార్లు చేతిలో డబ్బున్నన్నాళ్లూ అందర్నీ కాళ్లకింద చెప్పుల్లా చూస్తారు. వాళ్లస్థితి మారే సరికి ఇదిగో... ఇలాగ వేధిస్తారు. వాళ్లకి ఏదో ఉద్యోగం ఇవ్వటమే మనభాగ్యం అనుకుని ఎగిరి గంతేసి ఇస్తామని వాళ్ల ఐడియా పాపం! అంటూ ఇలా ఎన్నో ఇటువంటి సంభాషణలు నా చెవికి సోకిన తర్వాత గానీ నాకు లోకం పోకడ పూర్తిగా అర్థం కాలేదు.

ఒకచోట స్పష్టంగా నా మొహం మీదే మీకు పనిస్తే మా పని ఆఖరు. మీ దర్జాలకి మా కంపెనీని తాకట్టు పెట్టినా ఆశ్చర్యపడనక్కరలేదు అన్నాడు. అప్పుడు తెలిసింది నాకు మా కేదో పెద్దగౌరవం ఉందనుకుంటున్నాం గానీ అదంతా నేతి బీరకాయలోని నెయ్యిలాంటిదని.

నోరు తెరిచి అడగాలే గాని మా దగ్గర ఒకరు ఉపకారం పొందినట్లే ఇంకొకరు మనకి ఉపకారం చెయ్యరా? అనుకున్నాను. నేనలా అనుకున్నానంటే అప్పుడు నేనెంత అహంకారంగా ఆలోచించానో ఇప్పుడర్థం అవుతోంది. మేము చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యాలని వాళ్లు అనుకోవాలే గాని, తప్పక చేస్తారని నేననుకోవటం... వాళ్లు చెయ్యలేదని నిరాశపడటం, కోపం తెచ్చుకోవటం, వాళ్లకి శాపనార్థాలు పెట్టి...ఇదంతా తెలివితక్కువతనం.

తనకు మాలిన ధర్మం చెయ్యమని ఎవరన్నారు? గొప్పకోసం మిడిసిపడమని ఎవరు చెప్పారు? ఈనాడిలా బీదరుపులు అరచి ప్రయోజనం ఏమిటి? దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకోలేని మూఢుడు. ఇది నా మీద ఈ నాటి ప్రజల అభిప్రాయం. నిజమే! వారి అభిప్రాయం సెంట్ పర్సెంట్ కరెక్ట్.

గౌరీ శంకరం చెప్పినవన్నీ శ్రద్ధగా విన్నాడు కేశవమూర్తి. దీర్ఘంగా నిట్టూర్చి నిదానంగా ఆలోచిద్దాం. అవే విషయాలు ఆలోచిస్తూ బాధపడకండి మిత్రునికి ధైర్యం చెప్పాడు.

రోజులు వారాలై , వారాలు నెలలై పోతున్నాయి. కానీ గౌరీశంకరం సమస్య సమస్యలాగే మిగిలింది. అతడొచ్చి మూడు నెలలైంది. వసుంధరతో చనువు ఏర్పడింది. చెల్లెమ్మ వరుస కూడా కలిపింది. అతడిని అన్నయ్యా అని పిలిచేది.

గౌరీశంకరం సాగిన సంభాషణ అంతా తీరి వేళల్లో భర్తకి చెప్పింది వసుంధర. తమ బంధువులలో అవివాహితులుగా ఉండిపోయిన ఆడపిల్లల్ని ఎవరినైనా అతనికిచ్చి చేస్తే అనే ఆలోచన చేసింది భర్తతో. "అతనికిప్పుడు పెళ్ళేమిటి? ఏభయ్యోవపడిలో పడ్డాక" అని చప్పరించేశాడు కేశవమూర్తి. "నిజమేననుకోండి. కాని ముసలితనంలో అతన్ని ఆదరించేవారెవరు?" బాధగా అంది వసుంధర. ఆ ప్రశ్నకి కేశవమూర్తి దగ్గర జవాబులేదు. అందుకే నిశ్శబ్దంగా ఆలోచిస్తూండిపోయాడు.

కేశవమూర్తి కూతురుకి పెళ్లైపోవడం, కొడుకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉండటంతో గౌరీశంకరం రాక వారికి బాగా ఉత్సాహంగా ఉంటున్నది. కేశవమూర్తి ఉత్తరాలు వ్రాసినా తన స్థితికి కించపడ్తూ జవాబిచ్చేవాడు కాడు గౌరీశంకరం పూర్వం. రెండు, మూడు సార్లు ఇంటికి వెళ్లినా కనిపించక తప్పించుకున్నాడు. కాని ఈనాడు అతని ఇంట్లోనే నివశిస్తున్నాడు. ఎంతవిచిత్రం?

పత్రికలలో వస్తున్న కవితా సాహిత్యాన్ని గురించి, కథల ప్రమాణాల్ని గురించి చర్చించుకునేవారు. రేడియోలోనూ— టీవీలోనూ వచ్చే సంగీత స్వారశ్యాన్ని గురించి, నాటకాలలోని నాణ్యత గురించి విమర్శించుకునే వారు.

వసుంధర, గౌరీశంకరం లైబ్రరీలకి వెళ్లి రకరకాల గ్రంథాలు తెచ్చి అధ్యయనం చేసేవారు. గౌరీశంకరం ఇంటిచుట్టూ ఉన్న తోట బాగోగులు చూస్తుండేవాడు. కొంతకాలం అలా గడిపేవాడు. గౌరీశంకరం వచ్చాక పూలతోట కళకలాడుతూ ఇంపుగా తయారైంది.

ఉన్నట్లుండి గౌరీ శంకరంలో విద్యాదాహం బయలుదేరింది. తోటమాలి తమిళుడు. అతడు స్కూలు చదువు పూర్తి చేసినవాడు. అతడిని గురువుగా చేసుకుని అతడి దగ్గర అక్షరాలు నేర్చుకున్నాడు. బాగా చదవటం వచ్చే వరకూ నిద్రపోలేదతడు. తమిళ వాఙ్మయ గ్రంథాలు దొరికినన్ని తెచ్చి క్షుణ్ణంగా చదవసాగాడు. సంస్కృత గ్రంథాలన్నీ విరివిగా తెచ్చి చదివి, వాటికి —తమిళ గ్రంథాలకీ ఉన్న పోలికలు —వ్యత్యాసాల గురించి నోట్సు తయారు చేయసాగాడు. రెండు భాషలపై చక్కని చర్చా వ్యాసాలు తయారు చేశాడు. అంతటితో అతని దాహం తీరలేదు సరికదా మరింత విజృంభించింది.

రేడియోలో సర్వజ్ఞ వచనాలతాత్పర్యం విని ప్రభావితుడయ్యాడు. లైబ్రరీలో ఒక కన్నడ భాషాకోవిదుడిని మిత్రుని చేసుకొని నాలుగైదు రోజుల్లో కన్నడ భాష, ఒక మోస్తరుగా చదవటం నేర్చుకున్నాడు. అభివృద్ధి పరచుకున్నాడు. రాత్రింబవళ్లు తన సమస్యలు కూడా మర్చిపోయేంతగా అందులో లీనమైపోయాడు గౌరీశంకరం.

"ఎన్ని రోజులు గడిచాయో" అనే విషయం అతని దృష్టిలోలేదు. మనిషిలో పూర్వంకంటే ఆత్మవిశ్వాసం మెరుగైంది. చూపుల్లో చక్కని వివేచనం కన్పిస్తోంది. అతనిలో వచ్చిన మార్పుకి కేశవమూర్తి, వసుంధర చాలా సంతోషపడ్డారు.

అతని వ్యాసాలూ, కవితలు, కథలు చదివిన కేశవమూర్తి వాటిని తెచ్చి వసుంధరకిచ్చి "ముత్యాలకోవలాంటి నీ చేతిరాతతో వీటన్నిటినీ తిరగరాయి" అన్నాడు.

బాగాపేరు పొందిన పత్రికలకి గౌరీశంకరం రచనల్ని పంపాడు కేశవమూర్తి. వారంలోనే అన్ని పత్రికల నుంచి ప్రచురణకి అంగీకరించినట్లు తెలిపారు. ఇంకా ఇలాంటి వ్యాసాలు పంపమనీ, సీరియల్‌గా ప్రతీవారం సంతోషంగా ప్రచురిస్తామనీ ఆ లేఖలో వివరించారు.

అతని వ్యాసం ప్రచురింపబడిన పుస్తకం చూపించాడు కేశవమూర్తి గౌరీ శంకరానికి. ఆ వ్యాసం చివరి సంపాదకుని వ్యాఖానం చదివి సన్నగా మందహాసం చేశాడు గౌరీశంకరం. ఆ మందహాసంలో తృప్తితో కూడిన కాంతిరేఖలు చూసి ఆనందించారా దంపతులు.

గౌరీశంకరంలో ఉత్సాహం ఇనుమడించింది. పుంఖానుపుంఖాలుగా, ఎడతెలిపి లేకుండా వేదవ్యాసుడే ఆదేశించాడా" అన్నట్లు రాసేస్తున్నాడు గౌరాశంకరం. జి.ఎస్.పి. అనే కలంపేరుతో అతడు రాస్తున్న ప్రతీఒక్కటి అచ్చవుతున్నాయి రకరకాల పత్రికలలో!

పాఠకలోకంలో జి.ఎస్.పి. రచనలు సంచలనం రేకెత్తించాయి. వారిలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని మేల్కొలిపాయి. పాఠకుల్ని ఆలోచింపజేశాయి. చేస్తున్నాయి. ఒకరిద్దరు "సుసంస్కృతి నింపుకున్న మీ రచనలు చదివి" తమ నీచ పంథాను మార్చుకున్నట్లు స్వయంగా వ్రాసుకున్నారు. ఏ పత్రికలో చూసినా "జి.ఎస్. పి" వి రాబోతున్న రచనల గురించి ప్రచారం పూర్తవుతున్న రచనల గురించి పొగడ్తలు.

ఎంతపొగడుతున్నా సన్నని చిరునవ్వే గౌరీశంకరం సమాధానం. "ఇన్నాళ్ళూ ఈ ప్రతిభ లోలోపల ఎందుకు దాచుకున్నారు అన్నయ్యా?" సంభ్రమంగా అడిగింది వసుంధర. అవేళ సాహిత్యాభిలాషులు గౌరీశంకరాన్ని ఘనంగా సన్మానించాలనే నిశ్చయానికి వచ్చి ఇంటికొచ్చి మనవి చేసుకున్నారు. ముందు ఒప్పుకోలేదుగాని కేశవమూర్తి, భార్య బతిమాలి ఒప్పించారు. అందుకే వసుంధర సంబరపడ్తూ అడిగింది అలా!

"చెల్లాయ్! నేను అహల్య స్థానంలో ఉన్న రాతిని. పూర్వపు జమీందారీయే నాకు శాపం! నీ కేశవమూర్తి శ్రీ రామమూర్తిలాగ నన్ను శాపవిముక్తుని చేశాడు. మబ్బులు తొలగితే జరిగేది ప్రకాశ దర్శనం" అన్నాడు. "రత్నం రత్నంలాగ కన్పించాలన్నా కాలం కలిసి రావాలని స్పష్టమైందిగా" అన్నాడు కేశవమూర్తి.

అతని రచన ఒకటి రాష్ట్ర ప్రభుత్వ అవార్డును కూడా పొందటంతో అందరికీ ఉత్సాహం మరింత వృద్ధిపొందింది. సంపాదకులు దుశ్శాలువలు కప్పి, నగదు బహుమతులు— యోగ్యతా పత్రాలు సమర్పించారు. రాష్ట్రపతి అవార్డు, యోగ్యతాపత్రం, నగుదు ఇచ్చి, "సర్వ కవితా విధాత" అనే బిరుదు ప్రదానం చేశారు.

అతడి రచనల పట్ల గౌరవం ఉన్నవారు శక్త్యానుసారం కానుకలు బహూకరించి సత్కరించారు. ఇదంతా దూరంగా నిల్చుండి చూస్తున్న కేశవమూర్తిని పిలిచి కౌగలించుకున్నాడు గౌరీశంకరం.

ఆ సన్మానానికి హాజరైన వారిలో గౌరీశంకరాన్ని గతంలో మాటలతో హింసించిన వారూ ఉన్నారు. మోసం చేసిన వారు ఉన్నారు. వారందరిని చూస్తూ ప్రపంచాన్ని జయించినట్లు అతని పెదవులపై చిరు"హేల" కదులుతోంది. తనుగానీ తన తల్లిదండ్రులుగాని, అపాత్రదానమే ఎక్కువ చేసినా అర్థవంతమైనా దానమూ చేశారని ఆ దాన ఫలితమే ఇప్పుడు తనని తరగని ఆస్తిని, కీర్తికి సిసలైన జమీందారుని చేసిందనే సంతృప్తి అతడి కళ్ళలో ద్యోతకమైంది. ★

ఉప్మాలో పంచదార వెయ్యమంటారా? చెట్నీ వెయ్యమంటారా? ఎండ్రిన్ వెయ్యి. ఇంకా కొన్ని పురుగులు బతికి ఉన్నాయి.

జి.వెంకటకృష్ణ
కిర్లంపూడి

